సాక్షి ఒడిశా

శనివారం । 16 । నవంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 8,60,308
బంగారం : 4 గ్రాముల 300 మిల్లీ గ్రాములు
వెండి : 106 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



అగ్ని ప్రమాదం

ఖుర్దా రోడ్డులోని ఓ వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఓ వ్యాపారి చనిపోయారు.

- 10లో



శిశున్యాయ సచేతన శిబిరం

కొరాపుట్‌లో శిశున్యాయ సచేతన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

- 10లో

న్యూస్‌రీల్

తెప్పోత్సవానికి వెళ్లి చిన్నారి మృతి



చిన్నారి మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి చంపనగార్ వద్ద శుక్రవారం జరిగిన తెప్పోత్సవానికి వెళ్లి అక్కడ చెరువులో మునిగి 12 ఏళ్ల సావిత్రీ హంతాళ్ మృతి చెందింది. ఒడిశాలో కార్తిక మాసం చివరి రోజున మహిళలు చెరువులో తెప్పలు వదులుతారు. దీంతో పాటు చిల్లర కూడా వదులుతారు. ఆ చిల్లర డబ్బుల కోసం గ్రామంలో చిన్న పిల్లలు చెరువు వద్దకు చేరారు. వారితో సావిత్రీ కూడా వచ్చింది. తెప్పపై ఉన్న చిల్లర తీస్తూ చెరువులో మునిగిపోయింది. అక్కడున్న వారు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు చెరువు వద్దకు వచ్చి బాలికను బయటకు తీశారు. కానీ అప్పటికే ఆ బాలిక చనిపోయింది. మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ రీగాన్‌కీండో తన సిబ్బందితో వెళ్లి కేసు నమోదు చేశారు.

పాముకాటుతో మహిళ మృతి



కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద గంగి మృతదేహం

మల్కన్‌గిరి: పాముకాటుతో మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి బేజాంగవాడ పంచాయతీలో చోటుచేసుకుంది. గంగి (50) అనే మహిళ శుక్రవారం తెల్లవారుజామున స్నానం చేసి చీర కట్టుకుంటుండగా అందులో ఉన్న విషసర్పం కాటు వేసింది. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయగా.. నిద్రలో ఉన్న భర్త లేచి వచ్చి చూసేసరికి పాము కనిపించింది. అస్వస్థతకు గురైన గంగిని ఆటోలో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరగలించారు. పరీక్షించిన డాక్టర్లు గంగి అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి ఆరోగ్య కేంద్రానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసిన తరువాత పోస్టుమార్టం నిమిత్తం గంగి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

చెరువులో మృతదేహం



తల లేని మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి పోట్టేరు నదిలో ఎంవీ 57 గ్రామం వద్ద చెరువులో ఓ గోనె సంచి తేలుతూ కనిపించింది. దీంతో స్థానికులు కలిమెల పోలీసులకు సమాచారమిచ్చారు. ఐఐసీ చంద్రకాంత్ తన సిబ్బందితో చెరువు వద్దకు వెళ్లి అగ్నిమాపక సిబ్బందిని పిలిచి గోనెసంచిని బయటకు తీయించారు. అందులో తల లేని ఓ మృతదేహం లభ్యమైంది. అది ఓ పురుషుడి మృతదేహంగా గుర్తించారు. ఘటన జరిగిన ఐదారు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. మృతుడి వయసు 35 నుంచి 40 మధ్య ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

గజపతి-గంజాం సరిహద్దులో పెద్దపులి సంచారం



మోహన బ్లాక్‌లో పులి ఆనవాళ్లు పరిశీలిస్తున్న చంద్రగిరి అటవీ రేంజ్ అధికారులు



గజపతి-గంజాం సరిహద్దులో పులి సంచారం (ఫైల్)

పర్లాకిమిడి: గంజాం-గజపతి జిల్లా సరిహద్దు మోహనా బ్లాక్ అక్కిలి గ్రామం వద్ద పులి సంచరిస్తున్నట్టు గ్రామస్తులు చంద్రగిరి అటవీ రేంజ్ అధికారి బిశ్వాస్‌రాయ్‌కు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం సరిహద్దులో సంచరిస్తూ ఒక ఆవును తిన్న అవశేషాలు గ్రామస్తులు కనుగొన్నారు. దీంతో చంద్రగిరి అటవీ రేంజ్ అధికారులు పులి అడుగుజాడలు పరిశీలిస్తున్నారు. మోహనా బ్లాక్‌లో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయంతో చీకటి పడితే బయటకు రావడానికి భయపడుతున్నారు.



స్వర్ణ శోభిత రాజరాజేశ్వర రూపంలో శ్రీ జగన్నాథ స్వామి

కార్తీక శోభ



పడవతో కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్



దివ్యకాంతులతో కొరాపుట్‌లో శబరి శ్రీ జగన్నాథ దివ్య క్షేత్రం



జయపురం: ఖజురీబంద వద్ద కార్తీక పూజలు చేస్తున్న మహిళలు

భువనేశ్వర్: పవిత్ర కార్తీక పూర్ణిమ సందర్భంగా శ్రీక్షేత్రం కిటకిటలాడింది. శ్రీ మందిరం రత్న సింహాసనంపై ఆశీనులైన బలభద్ర స్వామి, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథ స్వామికి స్వర్ణ అలంకరణ చేసి భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. స్వర్ణ అలంకారంలో స్వామిని భక్తులు రాజరాజేశ్వరునిగా దర్శించుకోవడం విశేషం. ఈ దర్శనం కోసం పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రద్దీ నియంత్రణ కోసం శ్రీ మందిరం పరిసరాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుణ్య పుష్కరిణి తీరాలకు కొత్త కళ

పూరీ మహా దధి (సముద్రం) తీరం మొదలుకొని పవిత్ర పంచ తీర్థాలు (పుష్కరిణిలు) భక్తుల తాకిడితో కొత్త కళని సంతరించుకున్నాయి. కార్తీక పూర్ణిమ పురస్కరించుకుని ఈ తీరాల్లో భక్తులు ధూప దీపాలతో తెప్పల్ని వదిలారు.

కార్తీకం ముగిసింది

స్థానికులకు పవిత్ర కార్తీక మాసం పూర్ణిమతో ముగిసింది. గత నెల రోజులుగా దీక్షతో కార్తీక వ్రతం ఆచరించిన హిబిష్యాలీలు వ్రతం ముగింపు సందర్భంగా శ్రీ మందిరంలో రత్న వేదికపై స్వామిని రాజరాజేశ్వరునిగా దర్శించుకునేందుకు తండోప తండాలుగా తరలి వచ్చారు.

పోలీసు భద్రత

రాజరాజేశ్వరుని దర్శనం, సముద్ర, పుష్కరిణి తీర ప్రాంతాల్లో తెప్పోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఈ ప్రాంతాల్ని అనుసంధానపరిచే మార్గాల్లో వాహనాల రాకపోకల్ని నియంత్రించారు. పలు చోట్ల వీరి రవాణా దారి మళ్లించారు. మరో వైపు శాంతిభద్రతల కోసం పూరీ జిల్లా యంత్రాంగం 36 ప్లాటూన్ల పోలీసుల్ని మోహరించింది. ప్రధానంగా సముద్రం, పుష్కరిణి తీరాల్లో నీట మునిగే ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక పహరా ఏర్పాటు చేశారు.



జయపురం: బ్యాంక్ కాలనీ ఆలయంలో కార్తీక దీపాలు

జయపురంలో..

జయపురం: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి జయపురంలో ఆధ్యాత్మిక శోభ కనిపించింది. పట్టణంలోని రోడ్లన్నీ భక్తులతో పోటెత్తాయి.

కొరాపుట్‌లో..

కొరాపుట్: ఉత్కళ ప్రజలు కార్తీక మాసం ముగింపు సందర్భంగా జరుపుకునే బొయితొ బొంధానొ ఉత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం వేకువజామున కార్తీక పౌర్ణమిని గుర్తు చేసుకుంటూ ప్రజలు నదులు,చెరువుల వద్ద కార్తీక దీపాలతో పడవలు వదిలారు.

రాయగడలో..

రాయగడ: పట్టణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నాగావళి, జంఝావతి నదీ తీరాల్లో సందడి కనిపించింది. గంగమ్మ తల్లికి పూజలతో పాటు కార్తీక దీపాలను వెలిగించి నదిలో విడిచిపెట్టారు. మహిళలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అరటి దవ్వ(డొప్ప)లకు బదులు ఈసారి ప్రత్యేకంగా రూపొందించిన డొప్పలు మార్కెట్‌లో సందడి చేశాయి.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: కార్తీక పౌర్ణమి సందర్భంగా కిమిడి-పాతపట్నం సరిహద్దు పవిత్ర మహేంద్రతనయ నదిలో వేకువజామున మహిళలు పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు చేసి అరటి డొప్పలతో తయారుచేసిన పడవలు వదిలారు. నది వద్ద ఎలాంటి తొక్కిసలాట జరుగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. అనంతరం పట్టణంలో మెడికల్ వద్ద శ్రీఅర్ధనారీశ్వరీ మందిరంలో స్వామిని దర్శించుకుని సాయంత్రం కార్తీక పౌర్ణమి పూజలు ఆచరించారు.

వేడుకగా బొయితొ బొంధానొ



నావికా పతాకం ఊపి బొయితొ బొంధానొ పడవని ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో కార్తీక పూర్ణిమ వేడుక కన్నుల పండువగా నిర్వహించారు. పారాదీప్ తీర ప్రాంతంలో ఈ వేడుకని బొయితొ బొంధానొగా జరుపుకోవడం పరిపాటి. ఈ ఏడాది ముఖ్యమంత్రి మోహన చరణ్ మాఝి పారాదీప్ తీరంలో బొయితొ బొంధానొ వేడుకలో పాల్గొని సంప్రదాయ పూజార్చన తర్వాత నావికా పతాకం ఊపి ప్రారంభించారు. ముఖ్యమంత్రి సతీమణి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కళింగ రాజ్యంగా ప్రాచుర్యం పొందిన రాష్ట్రం నావికా వ్యాపారానికి పేరొందింది. కళింగ నావికా వ్యాపార పరంపరకు ప్రతీకగా ఏటా బొయితొ బొంధానొ వేడుకని పారాదీప్ పోర్టు ట్రస్టు గత కొన్ని దశాబ్దాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి పూజ, ఉత్సవం, కార్యక్రమం ఆధ్యాత్మిక ప్రాధాన్యత సంతరించుకోగా కార్తీక పూర్ణిమ బొయితొ బొంధానొ వేడుక నావికా వ్యాపార పరంపరని ప్రతిబింబింపజేయడం ప్రత్యేకత. రాష్ట్ర చారిత్రాత్మక ఘట్టాల్లో నావికా వ్యాపారం సుస్థిర స్థానం కై వసం చేసుకుందని ముఖ్యమంత్రి ప్రసంగంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక లోక్ సభ సభ్యుడు బిభు తొరై పాల్గొన్నారు.




పారాదీప్ తీరంలో బొయితొ బొంధానొ వేడుకలో వేషధారణలో నావికా వ్యాపారులతో నిండిన పడవ



బొయితొ బొంధానొ పూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి దంపతులు



నదిలో దీపాలను విడిచిపెడుతున్న మహిళలు



జగన్నాథుని రూపంలో గల దీపాల దొప్పలు

నడి సంద్రంలో చిక్కుకున్న కార్తీక పడవ



నావికా వ్యాపారుల వేష ధారణ ప్రయాణికులతో నడి సంద్రంలో చిక్కుకున్న పడవ

భువనేశ్వర్: కార్తీక పూర్ణిమ ఉత్సవాల్లో స్వల్ప అలజడి చోటు చేసుకుంది. బొయితొ బొంధానొ వేడుకలో భాగంగా నావికా వ్యాపారుల వేషధారణతో తీరం నుంచి బయల్దేరిన ప్రయాణికుల పడవ నడి సముద్రంలో చిక్కుకుంది. భద్రక్ జిల్లా బాసుదేవ్‌పూర్ మండలం చూడామణి జెట్టీ ప్రాంతంలో శుక్ర వారం ఈ సంఘటన చోటు చేసుకుంది. మార్గ మధ్యంలో సాంకేతిక లోపంతో ఈ పడవ చిక్కుకుంది. దీనిలో సుమారు 100 మంది నావికా వేషధారులు ఉన్నట్లు సమాచారం. స్థానిక యంత్రాంగం సహాయ సహకారాలతో పడవలో చిక్కుకున్న నావిక వేషధారులకు సురక్షితంగా తీరానికి తరలించారు.



మహేంద్రతనయ నది వద్ద కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు, వృద్ధులు



మహేంద్రతనయ నది వద్ద శుక్రవారం పడవలు వదులుతున్న మహిళలు

పేలిన గ్యాస్ సిలిండర్

- ముగ్గురు అయ్యప్పస్వాములకు గాయాలు
- పరిస్థితి విషమం
- ఎగిరిపడిన ఇంటి పైకప్పు
- నుజ్జయిన కారు



గాయపడిన వ్యక్తి

రాయగడ: గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురు అయ్యప్పస్వాము తీవ్రగాయాలకు గురయ్యారు. స్థానిక రాణిగుడఫారం వద్ద శుక్రవారం తెల్లవారు నాలుగు గంటల సమయంలో చోటు చేసుకోగా.. డి.శివ, ధర్మా మినియాక, దిన మినియాకలు గాయపడ్డారు. అయ్యప్పమాల దీక్షలో ఉన్న వీరు రాణిగుడఫారం వద్ద ఒక ఇంటిని అద్దెకు తీసుకుని వారి నిత్యకార్యకలాపాలు నిర్వహిస్తుండేవారు. గురువారం ఇంటి తలుపులు వేసుకుని పనులపై బయటకు వెళ్లి..శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు తిరిగి వచ్చారు. వంటగది లైట్‌ను ఆన్ చేయగా ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. అప్పటికే గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగి ఇంటిపై కప్పు ఎగిరిపోయింది. దీంతో మంటల్లో చిక్కుకున్న ముగ్గురూ తీవ్రగాయాలకు గురయ్యారు. ప్రమాదం కారణంగా ఇంటి పక్కనే ఆపి ఉన్న కారుపై ఇంటి పైభాగానికి చెందిన సిమెంట్ ముక్కలు పడిపోవడంతో కారు నుజ్జునుజ్జయ్యింది. భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. అయితే ముగ్గురు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఇద్దరిని బరంపురం, మరొకరిని విశాఖపట్నం మెరుగైన చికిత్స కోసం తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




పేలుడుకు ఎగిరిన ఇంటి పైకప్పు



ప్రమాదంలో నుజ్జయిన కారు

నేటి నుంచి 4 ద్వారాల గుండా ప్రవేశం

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలో చతుర్ధా మూర్తుల దర్శనం సులభతరం అవుతుంది. ఈ నెల 16 శనివారం నుంచి దర్శనం కోసం భక్తుల్ని శ్రీ మందిరం 4 ద్వారాల గుండా ప్రవేశానికి అనుమతిస్తారు. సింహద్వారం మినహా ఇతర 3 ద్వారాల గుంగా నిష్క్రమణకు అనుమతిస్తారు. సేవాయత్‌లు, వారి కుటుంబీకులకు 4 ద్వారాల గుండా ప్రవేశం, నిష్క్రమణకు అనుమతిస్తారు. కార్తీక మాసం రద్దీ నియంత్రణలో భాగంగా భక్తులకు కేవలం సింహ ద్వారం గుండా ప్రవేశానికి అనుమతించారు. శుక్రవారంతో స్థానికులకు కార్తీక మాసం ముగియడంతో మరునాటి నుంచి నాలుగు ద్వారాల గుండా ప్రవేశానికి అనుమతించనున్నారు.



శ్రీ మందిరం

క్లుప్తంగా

ఐఈఐ కేంద్ర సభ్యునిగా రాజశేఖరరావు



రాజశేఖర్‌రావును అభినందిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఐఈఐ) సభ్యులుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు ఎంపికయ్యారు. వైస్ చాన్సలర్ కేఆర్ రజని ఆయనను శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ పరిధిలో ఆన్‌లైన్‌లో ఎంపిక నిర్వహించ గా, రాజశేఖర్‌కు ఎక్కువ మంది మద్దతు లభించటంతో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికం విభాగంలోఎంపికయ్యారు.1920 ఐఈఐ ప్రారంభమైం ది, కోల్‌కతా ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది.

ఏపీ బ్యాడ్మింటన్ టీమ్ మేనేజర్‌గా గురుగుబెల్లి



గురుగుబెల్లి రాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ జట్టుకు మేనేజర్‌గా సబ్ రిజిస్ట్రార్ డాక్టర్ గురుగుబెల్లి రాజు నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఏపీబీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మ చౌదరి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఒడిశా వేదికగా ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న ఆలిండియా జూనియర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో ఆంధ్రా జట్టుకు మేనేజర్‌గా డాక్టర్ రాజు వ్యవహరించనున్నారు.

సీజ్ చేసిన ఇసుక మాయం



మాయమైన ఇసుక పోగులు

సరుబుజ్జిలి: ఇటీవల అధికారులు సీజ్ చేసిన ఇసుకను కొంతమంది రాత్రి వేళల్లో బయటకు తరలిస్తున్నా రు. పెద్దపాలెం సమీపంలోని దంతవరపుకోటలో 'ఆగని ఇసుక దందా'పేరుతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఒక లారీతో పాటు పలుచోట్ల ఉన్న ఇసుకపోగులను సీజ్ చేశారు. సీజ్‌చేసిన ఇసుకను వీఆర్వోలు, వీఆర్‌ఏల పర్యవేక్షణలో ఉంచారు. వాటి తాజా ఫొటోలు ఎప్పటికప్పుడు కార్యాలయానికి పంపాలని ఆదేశాలిచ్చారు. అయి తే వారు ఆ వైపు పెద్దగా దృష్టిసారించలేదు. ఇదే అదనుగా భావించిన కొంతమంది ఇసుక వ్యాపారులు సీజ్ చేసిన ఇసుకను రాత్రి వేళల్లో లోడింగ్ చేసి లారీలకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది.

మద్యం మత్తులో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



లబ్బ శ్రీనివాసరావు(ఫైల్)

నరసన్నపేట: పోలాకి మండలం జిల్లోడు వలసకు చెందిన లబ్బ శ్రీనివాసరావు (32) మద్యం మత్తులో ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని ఇందిరానగర్ ప్రారంభంలో ఉన్న జనపనార శిక్షణ కేంద్ర భవనంపైన పోలీసులు గుర్తించారు. శ్రీనివాసరావు రెండు రోజులుగా ఇంటికి వెళ్లకపోవడంతో తల్లి జయమ్మ చుట్టుపక్కలంతా గాలించారు. ఎక్కడా ఆచూకీ తెలియరాలేదు. పోలీసులకు ఫిర్యాదుచేసేందుకు సిద్ధమవుతుండగా గురువారం రాత్రి జనపనార శిక్షణ కేంద్ర భవనం మేడపైన విగతజీవిగా కనిపించాడు. మద్యం అధికమై నీరు అందగా మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృత దేహానికి చీమలు పట్టడంతో రెండు రోజుల కిందటే మరణించి ఉండవచ్చని తెలుస్తోంది. తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యా దు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు శుక్రవారం అప్పగించారు. మృతునికి వివాహం కాలేదు. తండ్రి గతంలోనే మరణించాడు. భర్త, కుమారుడు ఇద్దరూ దూరం కావడంతో జయమ్మ కన్నీరు మున్నీరు అవుతుంది.

బావిలో పడి వ్యక్తి మృతి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పాత జాతీయ రహదారి ఆనుకుని ఉన్న రెల్లి వీధిలో శుక్రవారం సాయంత్రం ఓ వ్యక్తి బావిలో పడి మరణించాడు. స్వీట్ షాప్ కు చెందిన బ్యాకరీలో పనిచేస్తున్న వీరస్వామి (52) వ్యక్తి మద్యం మత్తులో బేకరీ వెనుక భాగంలో ఉన్న నేలబావిలో జారి పడిపోయి మరణించాడు. దీనిపై కాశీబుగ్గ పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి: ముఖ్యమంత్రి

- రూ.1,535 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన



జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగం



జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ప్రసంగం

భువనేశ్వర్: గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. జాతీయ స్థాయిలో జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బీహారు జముయి నుంచి ప్రారంభించారు. రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి వర్చువల్‌గా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ధర్‌తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష యోజన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు.

రాష్ట్రంలో 8 ఆదిమ దుర్బల గిరిజన సమూహం (పీవీటీజీ) తెగలకు అటవీ భూమి హక్కుల చట్టం కింద నివాస హక్కులను ముఖ్యమంత్రి ప్రకటించారు. బిర్సా ముండా స్మృతిని సజీవంగా కొనసాగించేందుకు భారత ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాల్ని అందజేస్తుందన్నారు. ఈ కార్యాచరణలో భాగంగా శుక్ర వారం ప్రారంభించిన ధర్‌తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష యోజన కార్యక్రమం కింద రాష్ట్రంలో 27 జిల్లాల్లో 7 వేల 667 గ్రామాల్ని జోడించినట్లు తెలిపారు.

16 ఆశ్రమ పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి శంకు స్థాపన చేశారు. ఒక్కో పాఠశాల అభ్యున్నతి కోసం రూ. 15 కోట్లు చొప్పున సమగ్రంగా రూ. 240 కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తుంది. ఇతర ప్రాజెక్టుల్లో రూ. 286 కోట్ల వ్యయంతో 13 ప్రాథమిక పాఠశాలల్ని ఉన్నత పాఠశాలలుగా అభివృద్ధి చేస్తారు. రూ. 852 కోట్లతో 426 ప్రాథమిక పాఠశాలలకు హాస్టలు భవనాలు నిర్మిస్తారు. స్థానిక గొట్టాపట్న ప్రాంతంలో రూ. 100 కోట్ల వ్యయ ప్రణాళికతో జన జాతి సంస్కృతి ఓ ఐతిహ్య భవనం నిర్మించడం జరగుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ధర్మ మహాసభ బోర్డు ఏర్పాటుకు చర్యలు



ప్రసంగిస్తున్న బాబా క్రాంతిగిరి మహారాజ్



హాజరైన ప్రతినిధులు, ప్రజలు

జయపురం: జయపురంలో హిందూ సమాజ్ వారు ధర్మ మహాసభ, సనాతన బోర్డు ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి స్థానిక రఘునాథ్ మందిర కూడలి వద్ద విశాల సమావేశం నిర్వహించి చర్చించారు. సభలో రాయగడ బాబా క్రాంతి గిరి మహారాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జయపురం బాబెబేభాయి భజరంగ్ హనుమాన్ చాలిసా పఠనం చేశారు. మహారాజ్ ధర్మ మహాసభ, సనాతన బోర్డు ఏర్పాటు ప్రధాన లక్ష్యాలను ఈ సందర్భంగా బాబా క్రాంతిగిరి వివరించారు. మనదేశాన్ని అక్రమ చొరబాటుదారులు రాకుండా ముక్త భారత్‌గా మార్చాలని, తిరుపతి మందిరంలో ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదంపై దర్యాప్తు జరపాలని, శ్రీకృష్ణ జన్మభూమికి విముక్తి కల్పించాలనే డిమాండ్ల సాధనకు ధర్మ మహాసభ, సనాతన బోర్డు ఏర్పాటు అవసరమన్నారు. ఈ నెల 16వ తేదీన ధర్మ మహాసభ, సనాతన బోర్డు జయపురంలో ఏర్పాటుకు ధర్మ సంసద సభ ప్రతినిధి దేవకీ నందన్ ఠాకూర్ జీ మహారాజ్ రానున్నారని వెల్లడించారు. ధర్మ మహాసభ, సనాతన బోర్డు ఏర్పాటులో ఆయనకు అందరూ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తమ ప్రయత్నాలను ప్రజల వద్దకు చేర్చాలని కోరారు. సమావేశంలో డాక్టర్ జలంధర త్రిపాఠీ, జయంత పాత్రో, నిరంజన్ పాణిగ్రహి, రజనీ నాయిక్, లలిత అగర్వాల్, సంతోష్ సాహు, చంద్రేష్ ఠాకూర్, హిందూ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

డొంగరచించిలో శిశున్యాయ సచేతన శిబిరం



వేదికపై సుమన్ జెన తదితరులు



హాజరైన విద్యార్థులు

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ ప్రతినిధులు జయపురం సమితి డొంగరిచించి గ్రామంలో శిశు న్యాయ సచేతన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా గొండరిచించి గ్రామ పంచాయతీ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో ముఖ్యఅతిథిగా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి దేశ పౌరులన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉత్తములుగా ఎదగాలన్నారు. పిల్లలకు, విద్యార్థులకు వారి హక్కులు, రక్షణ పరిరక్షణకు చట్టాలు ఉన్నాయని వివరించారు. శిబిరంలో గౌరవ అతిథిగా స్పెషల్ పోస్కో కోర్టు ప్రభుత్వ స్పెషల్ పీపీ డాక్టర్ జి.గాయిత్రీదేవి, ఆశ్రమ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు విజయ లక్ష్మణ సాహు ఉన్నారు.

వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం

- వ్యాపారి మృతి



వస్త్ర దుకాణంలో చెలరేగిన మంటలు



అగ్ని మాపక సిబ్బంది సహాయక చర్యలు



సూర్య మహాపాత్రో

భువనేశ్వర్: వస్త్ర దుకాణంలో ఆకస్మిక అగ్ని ప్రమాదంతో వ్యాపారి ఘటనా స్థలంలో మృతి చెందాడు. ఖుర్దారోడ్ (జట్నీ) రాజా బజారు గౌరీ గార్మెంట్సు దుకాణంలో శుక్ర వారం ఈ ఘటన సంభవించింది. లక్షలాది రూపాయల విలువైన దుస్తులు అగ్ని మంటల్లో దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో స్థానిక అగ్ని మాపక దళం ఘటనా స్థలం చేరుకున్నా మంటలు సమయంలోగా అదుపు చేయలేకపోయింది. ఖుర్దా టౌను నుంచి మరో యూనిట్ అగ్ని మాపక దళం ఘటనా స్థలం చేరడానికి ఆలస్యం కావడంతో వ్యాపారి మంటల్లో చిక్కుకుపోయారు. మృతుడిని సూర్య మహాపాత్రో (33)గా గుర్తించారు.

బిర్సాముండా ఆదర్శప్రాయుడు

- ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహలింగ్

మల్కన్‌గిరి: జిల్లాలో డీఎన్‌కే క్రీడా మైదానంలో సాతంత్ర్య యోధుడు బిర్సా ముండా జయంతిని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ముఖేష్ మహలింగ్ హాజరయ్యారు. వర్చువల్‌గా పీఎం నరేంద్ర మోడీ ప్రసంగించారు. బిర్సాముండా ఒరిస్సాకు ఎన్నో సేవలు చేశారన్నారు. బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మల్కన్‌గిరి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇక్కడ గిరిజనులకు అటవీ భూమిపై పూర్తి హక్కు ఉందన్నారు. చిత్రకొండ, మత్తిలి సమితుల్లో 24 సబ్ ఆరోగ్య శాఖ భవనాలకు శంకుస్థాపన చేశారు. రెండు డయాలసిస్ యూనిట్లకు భూమిపూజ చేశారు. కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమరి టంగులు, మల్కన్‌గిరి అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రదాన్, జిల్లా వైద్యాధికారి బ్రోజబంద్ దాస్, జిల్లా అదనపు ఎస్పీ తపన్ నారాయణ్ రోతో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండా జయంతి

రాయగడ: ఆదివాసీ నాయకుడు బిర్సాముండా జయంతిని గుణుపూర్‌లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారీ, కేంద్ర మాజీ మంత్రి విశ్వేశ్వర్ టుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బిర్సాముండా ఆదివాసీలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌లో పాల్గొని బిర్సాముండా జయంతిని దేశం యావత్తు జనజాతి గౌరవ దినోత్సవంగా పాటిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని మునిగుడ సమితిలో గల శకట గ్రామాన్ని ప్రధానమంత్రి ఆదర్శ గ్రామంగా ప్రకటించారు. జిల్లాలోని 1611 ప్రధానమంత్రి అవాస్ గృహాల నిర్మాణం చేయాలని ఆదేశించారు. 633 మంది లబ్ధిదారులు ఈ జిల్లాలోని ప్రధానమంత్రి ఆవాస్ గృహాలను శుభారంభం చేశారు. గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న మంత్రి ముఖేష్



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రారంభిస్తున్న మంత్రి ముఖేష్ మహలింగ్



బోండా గిరిజన మహిళను సత్కరిస్తున్న మంత్రి ముఖేష్ మహలింగ్



సభకు హాజరైన మహిళలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఫరూల్ పట్వారీ



లబ్ధిదారునికి ఆవాస్ గృహాలకు సంబంధించి చెక్కు అందిస్తున్న కేంద్ర మాజీ మంత్రి విశ్వేశ్వర్ టుడు

చలికాలం.. జరభద్రం





వృద్ధులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి

జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో పిల్లలు, పెద్దలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు అధికం. ప్రధానంగా ఆస్తమా ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలి. రోజులో కనీసం 20 నిమిషాల పాటు ఉదయం, సాయంత్రం శరీరంపై సూర్యకాంతి పడేలా చూసుకోవాలి. తప్పనిసరిగా తృణధాన్యాలు తీసుకోవాలి. పిల్లలకు కోడిగుడ్లు, విటమిన్–డి అధికంగా ఉంగే పదార్థాలను ఇవ్వాలి.

– సీహెచ్ సాయిగీత, వైద్యాధికారి, పీహెచ్‌సీ, హిరమండలం

- ప్రారంభమైన శీతల గాలులు
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

హిరమండలం: జిల్లాలో చలి గాలులు ప్రారంభమయ్యాయి. ఉదయం ఏడు గంటల వరకు పొగమంచు, చల్లదనం ఉంటోంది. సాయంత్రం ఆరు గంటల నుంచి చల్లని గాలులు వీస్తున్నాయి. ఈ శీతల గాలుల్లో వ్యాధులు పొంచి ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గిరిజన ప్రాంత వాసులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ప్రాథమిక దశలో..

జలుబు, దగ్గు, చలి జ్వరం, గొంతు నొప్పి వంటి రుగ్మతలు అధికం కాకముందే ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించాలి. వారి సూచనల మేరకు మందులు వాడుకోవాలి. చిన్నారులు, గుండె, డయాబెటిక్ బాధితులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ సీజన్‌లో వ్యాధులు ఎక్కువగా ఆశిస్తాయి. న్యూమోనియా, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు గురై ప్రాణాపాయ స్థితికి చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో వచ్చే ఏ చిన్న సమస్యనైనా అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యనిపుణులను సంప్రదించడం ఉత్తమం. ఈ కాలంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో ఇన్‌ఫెక్షన్స్, స్వైన్ ఫ్లూ వంటి ప్రాణాపాయ వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు శరీరానికి వేడినిచ్చే ఆహారా పదార్థాలను తినాలి. గుమ్మడి, బొప్పాయి, ఆరెంజ్, పసుపు రంగుతో కూడిన ఆహారాలు వాడటం శ్రేయస్కరం.

జాగ్రత్తలు ఇలా..

- చర్మం పొడిబారిపోకుండా ఔషధ పూరిత లేపనాలు వాడుకోవాలి.
- రసాయనాలతో కూడిన సబ్బుల బదులు మైల్డ్ సోప్స్ వాడటం మంచిది.
- గోరువెచ్చని నీటితో స్నానం చేయడం ఆరోగ్యకరం.
- చలి గాలుల కారణంగా చర్మ సంబంధిత, అస్తమా, గుండె జబ్బులు, చెవి, ముక్కు, గొంతు నొప్పులు వచ్చే ప్రమాదం ఉంది.
- ముఖ్యంగా చిన్న పిల్లల్లో చెవిపోటు, గొంతు నొప్పి, జలుబు వచ్చే అవకాశం ఉన్నందున సూర్యరశ్మి వచ్చాకే బయటకు పంపించాలి.
- రోజూ మూడు నుంచి తొమ్మిది గ్లాసుల నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి.
- పొగ తాగేవారు చలిలో వాకింగ్ చేస్తే రక్తనాళాలు సంకోచిస్తాయి. బీపీ, సుగర్ ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవాలి.
- ఆస్తమా, శ్వాసకు సంబంధించిన సమస్యలున్న వారు మంచులో నడిచే సమయంలో జాగ్రత్తలు పాటించాలి
- చక్కెర వ్యాధిగ్రస్తులు వ్యాయామం చేసే సమయంలో తీపి పదార్థాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఇన్‌హేలర్ వాడేందుకు బదులు ఉదయం, సాయంత్రం వేళల్లో నీటి ఆవిరి పట్టడం మంచిది.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



మునిసిపాలిటీ స్టాల్స్‌ను పడగొడుతున్న సిబ్బంది



పడగొట్టిన దుకాణం వద్ద యజమాని



ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

జయపురం: జయపురం మహాత్మా గాంధీ రోడ్డులో అధికారులు చేపడుతున్న ఆక్రమణల తొలగింపు శుక్రవారం కూడా కొనసాగింది. ప్రైవేట్ వ్యక్తుల దుకాణాలతోపాటు మునిసిపాలిటీ స్టాల్స్ కూడా తొలగిస్తున్నారు. దైనిక బజారు ప్రవేశ మార్గం వద్ద గల మునిసిపాలిటీ స్టాల్స్ డూమ్‌లను తీసివేశారు. ఎం.జి.రోడ్డులో దాదాపు అన్ని దుకాణాలు తొలగించటంతో వ్యాపారాలు నిలిచిపోయాయి. దుకాణాల శిథిలాలతో రోడ్డు నిండిపోయింది. ఈ రోడ్డులో నడవలేని పరిస్థితి ఏర్పడింది.

ఆకట్టుకున్న భక్తిగీతాలాపన



ఎమ్మెల్యే రూపేష్‌తో గ్రామస్తులు

పర్లాకిమిడి: కార్తీక పౌర్ణమి సందర్భంగా గుసాని సమితి కత్తలకవిటిలో అష్టపహరీ భజనకు పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, గుసాని జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, కిశోర్ చంద్ర రథ్, కత్తలకవిటి గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం టౌన్: నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ ఎస్వీ.మాధవ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ సీసీ సంతోష్‌కుమార్, తదితరులున్నారు.

నాలుగు ట్రాక్టర్ల సీజ్



పట్టుబడిన ట్రాక్టర్లు

బొండపల్లి: మండలంలోని కనిమెరక గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువు నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ట్రాక్టర్లను తహసీల్దార్ డోల రాజేశ్వరరావుకు అప్పగించగా.. వాల్టా చట్టంను అతిక్రమించడంతో వాహన యజమానులకు జరిమానా విధించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 4 వేలు చొప్పున అపరాధ రుసుం విధించినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



ఉరిపోసుకుని మృతి చెందిన నాగేంద్ర

శృంగవరపుకోట: పట్టణంలోని శ్రీనివాస కాలనీ ప్రధాన రహదారిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్న వ్యక్తి ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం నరికేదిమిల్లిపాలెం గ్రామానికి చెందిన చిత్తూరి నాగేంద్ర ఎస్.కోటలో నివాసం ఉంటున్నాడు. కొద్దిరోజుల కిందట అతని భార్య స్వగ్రామానికి వెళ్లింది. శుక్రవారం ఆమె తన భర్తకు ఫోన్ చేయగా.. లిఫ్ట్ చేయకపోవడంతో సమీపంలో ఉన్న బంధువులకు ఫోన్ చేసింది. దీంతో వారు వచ్చి కిటికీ నుంచి చూడగా.. నాగేంద్ర ఉరిపోసుకుని కనిపించాడు. వెంటనే తలుపులు విరగ్గొట్టి చూడగా.. అప్పటికే ఆయన మృతి చెందాడు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అత్యాచారయత్నం కేసు నమోదు

శృంగవరపుకోట : వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.కోట సీఐ ఎస్వీ రమణమూర్తి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గంట్యాడ మండలం పెదమానాపురం గ్రామానికి చెందిన మహిళ తన కుమారుడి స్టడీ సర్టిఫికెట్‌లో తప్పులు సరిచేయాలని పెదమానాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం టి.శ్రీనివాసరావును ఫోన్‌లో కోరింది. దీంతో ఆమెను స్కూల్‌కి రావాలని చెప్పడంతో చందులూరులో తన అమ్మగారి ఇంటి వద్ద ఉన్న వివాహిత గురువారం ఉదయం ఎస్.కోట వచ్చింది. ఆమెను తన బైక్‌పై ఎక్కించుకున్న హెచ్ఎం శ్రీనివాసరావు పాత హెచ్ఎం వద్దకు వెళ్లాలని చెప్పి బొడ్డవర వద్ద తోటలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేసే ప్రయత్నం చేశాడు. ఆమె పెద్దగా కేకలు వేసి గొడవ చేయడంతో భయపడి ఆమెను పందిరప్పన్న జంక్షన్ వద్దకు తీసుకొచ్చి దించేసి అసభ్యకరంగా దూషించాడు. దీంతో ఆమె విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్వీ రమణమూర్తి చెప్పారు.

నేడు మత్తిరు వేంకటేశ్వరుని కల్యాణం

దెంకాడ: మండలంలోని గంట్లాం శ్రీశాంతి క్షేత్రంలో వెలసిన మత్తిరు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు గంట్లాం మాజీ సర్పంచ్ మల్లపురాజు కాసులరాజు తెలిపారు. కార్తీక మాస బహుళ పాడ్యమి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. వేదపండితులచే పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం శ్రీనివాసుని కల్యాణం నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు.



- మాతా,శిశు సంరక్షణ గాలికి..
- మరణాలను కట్టడి చేయలేకపోతున్న వైనం
- నాలుగు నెలల్లో ఏడుగురు తల్లులు, 12 మంది చిన్నారులు మృతి
- గర్భిణుల ఆరోగ్యంపై పర్యవేక్షణ కరువు

☛ మోపాడ పీహెచ్‌సీ పరిధిలోని రెయ్యి దుర్గాదేవి (25) ఆగస్టు 30న విజయనగరంలోని ఘోషా ఆస్పత్రిలో ప్రసవించింది. ప్రసవం తర్వాత ఆరోగ్యం బాగోలేక పోవడంతో వైద్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ అక్టోబర్ 4న మరణించింది.

☛ పట్టణంలోని సంతపేట యూపీహెచ్‌సీ పరిధిలోని కోసూరి శశిప్రియ (24) సెప్టెంబర్ 30న పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ప్రసవించింది. ఆ తర్వాత ఆరోగ్యం బాగోలేక పోవడంతో ఆమెను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అక్టోబర్ 9న మరణించింది.

☛ బూరాడ పీహెచ్‌సీ పరిధిలోని కొవ్వాడ సంతోషి (18) జూలై 27న విశాఖపట్నం కేజీహెచ్‌లో ప్రసవించింది. వారం రోజుల తర్వాత ఆరోగ్యం క్షీణించి అక్కడే కన్నుమూసింది.

అమ్మకు ప్రసవ గండం...

మాతృ,శిశు మరణాలు వివరాలు

నెల	మాతృ మరణాలు	శిశు మరణాలు
జూలై	01	03
ఆగస్టు	03	03
సెప్టెంబర్	01	03
అక్టోబర్	02	03

మరణాలను అరికట్టలేకపోతున్నారు..!

వైద్య రంగంలో అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చినప్పటికీ మాతృ, శిశు మరణాలు అధికంగా జరగడం బాధాకరం. మాతృ, శిశు మరణాలను వైద్య సిబ్బంది అరికట్టలేకపోతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సుఖ ప్రసవాలు నిర్వహించడంలోను, హైరిస్క్ గర్భిణులను గుర్తించి వైద్యసేవలు అందించడంలో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తున్నట్లు విమర్శలున్నాయి.

చిన్న వయసులోనే..

జూల నెల నుంచి అక్టోబర్ నెల వరకు ఏడు మాతృ మరణాలు సంభవించాయి. వీరిలో ఐదుగురు 30 ఏళ్ల లోపు వారే. అలాగే 12 మంది శిశువులు మరణించారు.

వెంటే వైద్య సిబ్బంది ..

గర్భిణి ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లినప్పుడు ఆశ వర్కర్ గాని ఏఎన్ఎం గాని ఆమెతో వెళ్లాల్సి ఉంది. కాని చాలా మంది గర్భిణులు ఆస్పత్రికి వెళ్లినప్పుడు వైద్య సిబ్బంది వెళ్లడం లేదు. దీంతో వారి పూర్తి ఆరోగ్య పరిస్థితి అక్కడ పీహెచ్‌సీ సిబ్బందికి తెలియడం లేదు. అదే సిబ్బంది వారి వెంటే ఉంటే కావాల్సిన పరీక్షలు చేయించడంతో పాటు వారికి మెరుగైన వైద్యం అందుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రసవాలు జరిగే ఆస్పత్రులు..

జిల్లాలో 48 పీహెచ్‌సీలున్నాయి. వీటిల్లో ఒకటి, రెండు మినహా మిగిలిన ఆస్పత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. అదే విధంగా నెల్లిమర్ల, భోగాపురం, బాడంగి, బొబ్బిలి సీహెచ్‌సీల్లోను.. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట, రాజాం ఏరియా ఆస్పత్రుల్లోను, ఘోషా ఆస్పత్రుల్లో కూడా ప్రసవాలు జరుగుతాయి.

విజయనగరం ఫోర్ట్: ఆరిక తోట పీహెచ్‌సీ పరిధిలోని బండారు లీలావతి (28) అనే గర్భిణి సెప్టెంబర్ 8వ తేదీన విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రసవించింది. ప్రసవం తర్వాత ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆమెను రామభద్రపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 18న మరణించింది.

ఈమే కాదు నాలుగు నెలల్లో ఏడు మంది తల్లులు మరణించారు. గర్భం దాల్చగానే మహిళలు ఎంతో ఆనందపడతారు. పుట్టబోయే బిడ్డ గురించి ఎన్నో కలలు కంటారు. తమ పిల్లలను ఎంతో ప్రేమతో అల్లారుముద్దుగా పెంచుకోవాలని ఆశ పడతారు. అయితే వారి కలలు నెరవేరడం లేదు. వారి అకాల మరణంతో పిల్లలు అనాథలుగా మిగులుతున్నారు. అలాగే బాహ్య ప్రపంచాన్ని చూడకుండా కొంత మంది శివవులు మృత్యువాత పడుతుండగా.. తల్లి గర్భంలోనే మరి కొంతమంది మృత్యువాత పడుతున్నారు. అదేవిధంగా తల్లుల్లో పౌష్టికాహారం లోపం వల్ల కొంతమంది.. సకాలంలో వైద్య సేవలు అందక మరి కొంతమంది మరణిస్తున్నారు. శిశు మరణాల వల్ల ఎంతోమంది తల్లులు గర్భశోకానికి గురవుతున్నారు. నవ మాసా లు మోసిన బిడ్డ పుట్టగానే మృతి చెందడంతో ఆ తల్లులు పడుతున్న బాధ వర్ణనాతీతం.

చర్యలు తీసుకుంటున్నాం..



మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రసవం తర్వాత ఆకస్మికంగా వచ్చే సమస్యల వల్ల మాతృ మరణాలు సంభవిస్తున్నాయి. మహిళలకు ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే వారి ప్రాణాలు కాపాడడానికి వైద్య సిబ్బంది శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. నెలలు నిండకుండా పుట్టడం వల్ల, పుట్టిన తర్వాత వచ్చే అనేక ఆరోగ్య సమస్యల వల్ల శిశువులు మృతి చెందుతున్నారు. మాతృ, శిశు మరణాల జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ కె. రాణి, డీఎంహెచ్ఓ

● భక్తిశ్రద్ధలతో చండీయాగం..



జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలోను, మూడులాంతర్లు జంక్షన్ వద్దనున్న చదురుగుడి ఆవరణలోనూ వేద పండితులు శుక్రవారం చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా యాగ విశిష్టతను వేద పండితులు దూసి శివప్రసాద్, సాయి, నరసింహమూర్తి వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

– విజయనగరం టౌన్

● పోలీస్ వెల్ఫేర్ డే..



జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో వెల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహించి, సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. సిబ్బంది తెలియజేసిన సమస్యలను విన్న ఎస్పీ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

– విజయనగరం క్రైమ్

42 మంది జూదరుల అరెస్ట్

- రూ.17,34,190 నగదు స్వాధీనం
- 49 సెల్‌ఫోన్‌లు, రెండు కార్లు, రెండు బైక్‌లు సీజ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని రింగ్‌రోడ్డు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు నేతృత్వంలో టూటౌన్ సీఐ ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది గురువారం రాత్రి దాడి చేసి పేకాటాడుతున్న 42 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ.. ఫంక్షన్ హాల్‌లో కొంతమంది గదులను అద్దెకు తీసుకుని పేకాటాడుతున్నట్లు సమాచారం అందడంతో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టూటౌన్ పోలీసులు దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా ఓ కానిస్టేబుల్‌తో సహా 41 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 17,34,190 రూపాయల నగదు, 49 సెల్‌ఫోన్లు, రెండు కార్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే గదులు అద్దెకు తీసుకున్నట్లు అగ్రిమెంట్ కాపీని కూడా సీజ్ చేశామన్నారు. పట్టుబడిన వారిలో విజయనగరం జిల్లాకు చెందిన వారు 15 మంది, శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారు ఆరుగురు, విశాఖకు చెందిన వారు 9 మంది, అనకాపల్లికి చెందిన వారు 11 మంది, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వారు ఒకరున్నారన్నారు. వీరిలో 14 మందిపై గతంలో పేకాటాడుతూ పట్టుబడినట్లు వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎమ్.శ్రీనివాసరావు, సీఐలు టి.శ్రీనివాసరావు, ఏవీ లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో జోన్-1 క్రీడాపోటీలు రెండో రోజైన శుక్రవారం ఉత్సాహభరితంగా సాగాయి. ఉత్తరాంధ్ర పరిధిలోని 12 బాలుర గురుకుల పాఠశాలల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. మొదటి, రెండో రోజులలో జూనియర్ విభాగం క్యారమ్స్‌లో ప్రథమ స్థానం పాలకొండ.. ద్వితీయ స్థానం శ్రీకృష్ణాపురం.. చదరంగం పోటీలలో ప్రథమ స్థానం సాలూరు.. ద్వితీయ స్థానంలో శ్రీకృష్ణాపురం విద్యార్థులు నిలిచారు. అలాగే 100 మీటర్ల పరుగుపందెంలో బి. గణేష్ (ప్రథమ), గౌరీశంకర్ (ద్వితీయ), వినయకుమార్ (తృతీయ) విజేతలుగా నిలిచారు. షార్ట్‌పుట్‌లో చరణ్‌తేజ (సాలూరు).. డిస్కస్‌త్రోలో కె. చరణ్‌తేజ (సాలూరు), బి. కరుణ, పి. హర్ష (పాలకొండ) వరుస స్థానాలు సాధించారు. సీనియర్ విభాగం 100 మీటర్ల పరుగుపందెంలో యాదగిరి (కంచిలి).. ఎస్. చరణ్, సుధీర్ (పార్వతీపురం).. 800 మీటర్ల పరుగు పందెంలో ఎస్. విజ్ఞాన్ (దుప్పలవలస), డి. దీక్షిత్, ఆర్. శివకృష్ణ (శ్రీకృష్ణాపురం) విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో గురుకులం జిల్లా కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, ప్రిన్సిపాల్ రఘురామనాయుడు, పీడీ పీఎల్ఎన్వీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా వైపు ఏనుగుల పయనం

భామిని: మండలంలోని తివ్వాకొండల్లో తిష్ట వేసిన ఏనుగుల గుంపు వంశధార నదివైపు పయనమైందని అటవీశాఖాధికారులు శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి వంశధార నది ఆవల గల ఒడిశా గ్రామాలకు నాలుగు ఏనుగుల గుంపు తరలి వెళ్లినట్లు చెప్పారు. ముందుగా భామిని మండలం తాలాడ, ఘనసర, కోసలి గ్రామాల పరిసరాల్లో తిరుగాడాయి.అనంతరం పొద్దుపోయాక నది ఆవలకు తరలివెళ్లడంతో నదీ తీర గ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు.

పాల ఉత్పాదకతను పెంచాలి

పార్వతీపురం: జిల్లాలో పాల ఉత్పాదకతను పెంచాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రాథమిక రంగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలఉత్పత్తిని 15 శాతం పెంచేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. దాణాలో ఉత్తమ విధానాలు అవలంబించాలని, పశువులకు మంచి ఆహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. డీ వార్మింగ్, ఇమ్యునైజేషన్ విధిగా చేయాలని సూచించారు. అజోలా, నేపియర్ గడ్డిని పెంచేందుకు రైతులను ప్రోత్సహించాలని కోరారు. సంతులిత ఆహారం అందించడంలో గోపాలమిత్రలు క్రియాశీలక పాత్ర వహించాలని, ప్రతి మండలంలో కనీసం 500 ఎకరాల్లో పశుదాణా పెంచేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

'డెయిరీ స్థాయి ప్రాజెక్టుకు చర్యలు

పాల ఉత్పత్తిని గణనీయయంగా పెంచేందుకు డెయిరీ స్థాయి ప్రాజెక్టుకు రూపకల్పన చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. పాల ఉత్పత్తి , పాల ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి పెద్ద ఎత్తున మార్కెటింగ్ చేయడంద్వారా రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచవచ్చని అభిప్రాయ పడ్డారు.

దయల్ యువర్ డీఏహెచ్ఓ

పశుపోషకాలకు అవసరమైన సమాచారం కోసం దయల్ యువర్ డీఏహెచ్ఓ ప్రతి నెలా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని జిల్లాపశు సంవర్థక అధికారి మన్మథరావును ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఉద్యాన అధికారి కేఏస్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ రేపు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా జిల్లా ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించనున్నట్లు శ్రీ చెస్ కోచింగ్ సెంటర్ అధినేత వి.వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 06 ,అండర్ 08 , అండర్ 10, అండర్ 12 అండర్ 14, అండర్ 16 విభాగాలలో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనేవారు ఆదివారం ఉదయం 8 గంటలకే హాజరుకావాలని, తప్పనిసరిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులచే ధృవీకరించిన స్టడీ సర్టిఫికెట్లను పుట్టిన తేదీతో సహా సమర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రూ.50, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు రూ.100 ప్రవేశ రుసుముగా చెల్లించి శనివారం సాయంత్రం ఐదు గంటలలోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 62812 95572 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రామతీర్థంలో వైభవంగా గోపురోత్సవం



గోపురోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో గోపురోత్సవ కార్యక్రమాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురష్కరించుకుని స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున స్వామివారికి సుప్రభాతసేవ, బాల భోగం తదితర కార్యక్రమాలు చేశారు. అనంతరం నిత్యకల్యాణం, యాగ శాలలో నిత్యహోమాలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు సీతారామచంద్రులను ప్రత్యేకంగా అలంకరించి పల్లికిలో తూర్పు రాజగోపురం పైకి తీసుకువెళ్లి విశేష అర్చనలు చేపట్టారు. ప్రతి ఏటా కార్తీక శుద్ధ పౌర్ణమి నాడు గోపురోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను అందుకున్నారు.

పక్కాగా స్కిల్ సెన్సస్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: నిరుద్యోగులైన 15 నుంచి 59 సంవత్సరాల మధ్యగల స్త్రీ, పురుషులు, ప్రైవేట్ రంగంలో పని చేస్తున్న వారికి అవసరమైన నైపుణ్యాలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య సర్వే నిర్వహిస్తోందని, ఈ సర్వే పక్కాగా జరిగేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. సర్వే చేయడానికి అవసరమైన శిక్షణను ఈ నెల 18 నుంచి 21లోగా ప్రతి మండలం, మున్సిపాలిటీలో సచివాలయ సిబ్బందికి ఇవ్వాలన్నారు. జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారి అరుణ సర్వేకు బాధ్యత వహించాలని తెలిపారు.

మార్చిలోగా ఎంఎస్ఎంఈల సర్వే

ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు సంబంధించిన సర్వేను వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. తన చాంబర్‌లో పరిశ్రమల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వే పూర్తి చేయడానికి సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్ని ఎంఎస్ఎంఈలు ఉన్నాయి.. వాటి పనితీరు.. నిర్వహణ.. టర్నోవర్.. తదితర అంశాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

రోడ్ల పనులు ప్రారంభించండి

రోడ్లపై గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన మరమ్మతు పనులన్నీ నవంబర్ నెలాఖరులోగా ప్రారంభించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. రోడ్ల మరమ్మతు పనుల పురోగతిపై కలెక్టర్ ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మంజూరైన మొత్తం 68 రోడ్డు పనులకు గాను ఇప్పటివరకు 22 పనులు ప్రారంభమైనట్లు రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ కాంతిమతి వివరించారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

● జిల్లా సహకార అధికారి రమేష్



సహకార జెండాను ఎగురవేస్తున్న సహకార అధికారి రమేష్

విజయనగరం ఫోర్ట్/విజయనగరం అర్బన్: సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని జిల్లా సహకార అధికారి పి.రమేష్ అన్నారు. జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (డీసీఎంఎస్)లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ముందుగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సహకార జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నవంబర్ 14 నుంచి వారం రోజుల పాటు సహకార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామిక రంగంలో కూడా సహకార సంఘాల ప్రాధాన్యతను పెంచేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఇప్పటికే ఎరువులు తయారీ, పాలు ఉత్పత్తిలో సహకార సంఘాలు గణనీయమైన విజయాన్ని సొంతం చేసుకున్నాయన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈఓ ఉమామహేశ్వరావు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో 95 పీఏసీఎస్‌లు ఉన్నాయని, వాటిన్నింటినీ కంప్యూటరీకరించే ప్రక్రియను శరవేగంగా నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా సహకార సంఘాలపై మరింత నమ్మకం, పారదర్శకత పెరగుతుందని చెప్పారు. ఐసీఎం కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందన్నారు. గ్రామీణ స్థాయిలోనే సహకార సంఘాలను కేవలం ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, ఇతర కార్యక్రమాలకు కూడ విస్తరించాలని నిర్ణయించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి బి.సన్యాసినాయుడు, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.